ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



తూర్పుగోదావరి

జిల్లా వార్తలు

సోమవారం 1 జనవరి 2024 | 5

సోషల్ మీడియా ముగ్గులో దిగొద్దు..



యువతరం సోషల్ మీడియాతో చిత్తవుతోంది. వాటిని వీడాలని కొవ్వూరుకు చెందిన సుస్మిత వేసిన ముగ్గు ఆలోచింపజేసింది..



ఎనిమిదింతల ఆనందం కావాలి...

2023 వెళ్లిపోయింది.. మరో ఏడాది కాలగర్భంలో కలిసిపోయింది.. 2024లోకి వచ్చేశాం..ఈ ఏడాది ఎలా ఉండాలి.. ప్రతి ఒక్కరిదీ ఒకటే ఆశ.. అంతా బాగుండాలి.. అలా బాగుండాలంటే ఏం ఉండాలి.. ప్రతి కుటుంబం ఆదాయం రెండింతలు పెరగాలి.. బాధలు..నష్టాలు.. కష్టాలు.. జీరోగా ఉండాలి.. వ్యయం రెండింతలు తగ్గాలి.. ఇలాగైతేనే నాలుగింతల ఆనందం పొందుతాం.. అంతా బాగుంటాం.. ఇదీ జనం ఆలోచన.. ఎందుకంటే 2023 లో అన్నీ కష్టాలు.. బాధలే.. అన్నదాతకు ప్రకృతి వైపరీత్యాలు.. జనానికి ధరాఘాతం.. ఎన్నికల ఏడాది కావడంతో రాజకీయ నాయకులకు అంతంతమాత్రంగానే ఉంది.2024లో ఇలా కాదు.. ఆనందంగా.. సంతోషంగా గడవాలని కోరుకుంటున్నారు. ఆంధ్రజ్యోతి కూడా అందరికీ 2024 ఆనందాన్ని పంచాలని.. కడియపులంక పల్ల గణపతి నర్సరీలో ఏర్పాటు చేసిన విరివనాలతో నూతన సంవత్సర శుభాకాంక్షలు చెబుతోంది..!!

3న సర్పంచ్‌ల సమర శంఖారావం

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 31 : మంగళగిరి సీకే కన్వెన్షన్‌లో ఈనెల 3న సర్పంచ్‌ల సమర శంఖారావం నిర్వహిస్తున్నామని జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు పాలడుగుల లక్ష్మణరావు తెలిపారు. రాజమహేంద్రవరం హోటల్ జగదీశ్వరిలో ఆదివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏపీ సర్పంచుల సంఘం, పంచాయితీరాజ్ ఛాంబర్‌ల ఆధ్వర్యంలో సదస్సు జరుగుతుందన్నారు. సర్పంచ్, జడ్పీటీసీలు, ఎంపీటీసీలు, ఎంపీపీలు తరలిరావాలని పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్ పంచాయతీ రాజ్ ఛాంబర్ రాష్ట్ర అధ్యక్షుడు వైవీబీ రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో జరిగే సదస్సుకు ప్రతిపక్ష నేత, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హాజరవుతారని చెప్పారు. సమావేశంలో సర్పంచ్‌లు సంఘం నాయకులు జెట్టి బంగారయ్య (జనసేన), సర్పంచ్ మేకా శ్రీనివాస్, సర్పంచ్ ఉప్పులూరి ముని ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మార్పు రావాలి!



2023 గడచిపోయింది.. కాలగర్భంలో కలిసిపోయింది.. ఎన్నో విషాదాలు.. మరెన్నో సంతోషాలు.. చివరిలో ఆందోళనలు.. 2023 ఏదో అలా గడచిపోయిందంతే.. మరీ 2024 ఎలా ఉండాలనుకుంటున్నారు.. మార్పు రావాలంటే మనం మారాలంతే..2024 అదే చెబుతోంది.. మార్పు అనేది మనతోనే ఆరంభంకావాలి.. రాజకీయంగా మనకు ఎవరు కరెక్ట్ అనేది తేల్చుకోవాల్సిన ఏడాది ఇది.. ఎందుకంటే ఎన్నికలు ఉండేది ఈ ఏడాదే.. మనం ఎలా బతకాలి అనేది మనమే నిర్ణయించుకోవాలి.. గంజాయి మత్తు వీడాలి.. సారా.. మనసారా.. వదిలేయాలి.. మన భద్రత మనమే చూసుకోవాలి.. అందరితో కలిసుండాలలి.. సమస్యలపై ప్రశ్నించాలి.. యువతరానికి ఒక లక్ష్యం ఉండాలి.. ఈ ఏడాది ఇలాంటి మార్పు రావాల్సిందే..

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

ఆప్యాయతకు మారుపేరు.. పరదాలా పరిచిన పచ్చదనం.. గోదారమ్మ ఒడిలో ఆహ్లాదంగా సాగిపోయే జీవనం.. ఇదీ మూడు ముక్కల్లో తూర్పుగోదావరి జిల్లా ఘనత. కానీ గత నాలుగేళ్లుగా ప్రశాంతాన్ని అశాంతి శాసిస్తోంది. సీఐ స్థాయి అధికారులు సైతం చోటామోటా నాయకుల మాటలు వినితీరాల్సిన పరిస్థితి దాపురించింది. కారణాలేమైనా అతి శృతిమించి సాధారణ జనజీవనాన్ని భయాందోళనలకు గురి చేస్తోంది. ఈ ఏడాది జిల్లాలో అన్ని రకాల నేరాలూ తగ్గాయని గణాంకాలను చూసి మురిసిపోతున్నా వాస్తవాలు మాత్రం మౌనంగా వెక్కిరిస్తున్నాయి.పోలీసు నిఘా నిద్దరోతుండడం.. నిఘా శాఖ(ఇంటెలిజెన్స్) రాజకీయ ఫీడ్‌బ్యాక్‌లకు మాత్రమే పరిమితం కావడం ప్రజల పాలిట శాపంగా మారాయనే ఆరోపణలు వినవస్తున్నాయి.మరోవైపు పౌరస్పృహ పట్టు తప్పడం.. సామాజికస్పృహ చల్లారిపోవ డం వం టివి నిశ్శబ్ద ప్రమాదాలుగా పరిణ మించాయి.ఈ పరిస్థితులు '2024'లో వ్యక్తిగతంగా.. సామాజికపరంగా.. రాజకీయంగా కచ్చితంగా 'మార్పు కావాలి' అని ఘోషిస్తున్నాయి.

రాజకీయం..

ఈ సారి మాత్రం కొత్త సంవత్సరానికి మరింత ప్రాధాన్యత ఉంది.2024 జనవరి వేడుకలకు రాజకీయ ప్రత్యేకత ఉంది. కొద్దినెలల్లోనే సార్వత్రిక ఎన్నికలు జరగనున్నాయి.ప్రధాన రాజకీయ పార్టీలన్నీ అధికారంలోకి రావాలని ఉవ్విళ్లూరుతున్నాయి.ఈ సారి తెలుగదేశం- జనసేన పార్టీ పొత్తుతో నాయకులు,కార్యకర్తల్లో జోష్ పెరిగింది. అధికారం చేజిక్కించుకునేందుకు ఇప్పటికే కదన రంగంలోకి దూకారు.. మీ భవిష్యత్ మాదంటూ ఇంటింటా పలకరిస్తున్నారు. ఇదిలా ఉండగా అధికార వైసీపీ మరోసారి అధికారం కైవసం చేసుకోవాలని భావిస్తోంది. కానీ గతంలో ఏ అధికార పార్టీకి లేనంత ప్రజ్యాతి రేకతను వైసీపీ ప్రభుత్వం మూటకట్టుకుంది.. జిల్లాలో ఒక పార్లమెంట్, ఏడు అసెంబ్లీ స్థానాలు ఉన్నాయి. ప్ర స్తుత రాజకీయ సమీకరణలు పూర్తిగా మారాయి. త్వర లో జరగనున్న సార్వత్రిక ఎన్నికలకు తెలుగుదేశం- జనసేన పార్టీలు సన్నద్ధమవుతున్నాయి. గత ఎన్నికల్లో ఈ రెండు పార్టీలు వేర్వేరుగా పోటీ చేసి దెబ్బతిన్న సంగతి తెలిసిందే. మరోసారి ఆ తప్పు జరగకూడదనే జతకట్టాయి.వైసీపీ ప్రభుత్వ వ్యతిరేక ఓట్లు చీలకూ డదనే లక్ష్యంతో పవన్ ముందుకు వచ్చిన సంగతి తెలిసిందే. ఇంకా ఈ రెండు పార్టీల మధ్య సీట్లు అధికారికంగా ఖరారు కాలేదు. కానీ ఇప్పటికే ఒక ఒప్పందం కుదిరినట్లు ప్రచారం జరుగుతోంది. సిట్టింగ్ ఎమ్మెల్యేలకు టికెట్లు పదిలమేనని గతంలోనే చంద్రబాబు ప్రకటించిన నేపథ్యంలో అర్బన్, రూరల్ ఎమ్మెల్యేల స్థానాలు పది లమేనని చెప్పవచ్చు.మిగిలిన స్థానాల సంగతి తేలాల్సి ఉంది. వైసీపీలో తీవ్ర గందరగోళం నెలకొంది.ఇప్పటికే సిటీ, రూరల్ స్థానాలకు కోఆర్డినేటర్లను కాదని అభ్యర్థులను మార్చివేసిన సంగతి తెలిసిందే..ఈ నేపథ్యంలో మిగిలిన స్థానాలపై ఉత్కంఠ నెలకొంది.తెలు గుదేశం,వైసీపీ రెండింటికి ఎంపీ అభ్యర్థులు కొత్త వారే వచ్చే అవకాశం ఉంది.ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యం లో అధిష్ఠానాలు అభ్యర్థులఖరారుపై దృష్టి సారిస్తున్నాయి.

గంజాయి మహమ్మారి..

గంజాయి మహమ్మారి యువత జీవితాలను నిర్వీర్యం చేస్తోంది.ఆంధ్ర ఒడిశా(ఏవోబీ)లో సాగవుతున్న గంజాయి జిల్లాకు కూడా సరఫరా అవుతోంది. పట్టణాలకే పరిమితమైన గంజాయి పొగ ఇప్పుడు పల్లెల్లో గుప్పుమంటోంది. ఈ ఏడాది రూ.2.63 కోట్ల విలువ చేసే 5300 కిలోల గంజాయి పోలీసులకు పట్టుబడింది. వారికి చిక్కకుండా మరో రెండింతల గంజాయి యువత ఆరోగ్యంలోకి చేరి పోయింది. ఇంత జరుగుతున్నా నిఘా, శాంతి భద్రతలు, నేర, నార్కోటిక్స్ తదితర విభాగాలు పసిగట్టలేకపోవడం విస్తుగొలుపుతోంది.

నాణ్యత లేని మద్యం - ఫుల్‌గా సారా

జిల్లాలో మద్యం అమ్మకాలు రూ.100 కోట్లు దాటేశాయి. నాణ్యతలేని ప్రభుత్వ మద్యానికి సారా జతకలిసి ఆరోగ్యాలను గుల్లచేసి కుటుంబాలను నాశనం చేస్తున్నాయి. మద్యం ధరల పెరుగుదలతో గత ప్రభుత్వంలో అదుపులోకి తెచ్చిన సారా ఈ ప్రభుత్వంలో సవాలు విసిరే స్థాయికి చేరింది. గోదావరి లంకల్లో గుట్టుగా తయారు చేసి ఊళ్లలోకి తరలిస్తున్నారు. ఈ ఏడాదిలో ఏకంగా 13,600 లీటర్ల సారా, 1లక్షా 55వేల లీటర్ల బెల్లపు ఊటను సెబ్ సిబ్బంది, పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులకు చిక్కిందే ఇంత పెద్ద ఎత్తున ఉంటే చాటుగా సరఫరా అయిపోయి జనాలను ముంచేస్తున్న సారా ఇంకా ఎంత భారీగా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. దీంతో ఈ నాలుగేళ్లలో కాలేయం, గుండె, ఉదర సంబంధిత వ్యాధులతో బాధపడే మందుబాబుల సంఖ్య గణనీయంగా పెరిగింది. అందుకే ఈ ఏడాది మందు,సారా రెండింటినీ వదిలేసి ఆరోగ్యంగా ఉండాలి.

ప్రాణాలను మింగేస్తున్న రోడ్లు

బయటకు వెళితే ఇంటికి క్షేమంగా చేరుకుంటామన్న నమ్మకం లేదు. ఎందుకంటే రోడ్లు అంత అధ్వానంగా ఉన్నాయి. ఈ ఏడాది 926 రోడ్డు ప్రమాదాలు జరిగాయి. 336 మంది బలైపోయారు. బ్లాక్‌స్పాట్లు గుర్తిస్తున్నా ఒకటి కంటే ఎక్కువ ప్రభుత్వ శాఖలు కలిపి చర్యలు తీసుకోవాల్సి ఉండడం విపరీత కాలయాపనకు దారితీసి భద్రతను ప్రాణాపాయం అధిగమిస్తోంది.

కానరాని పౌరస్పృహ?

రానురాను పౌరస్పృహ నీరసిస్తోంది.నాకెందుకులే అనే ధోరణి మితిమీరుతోంది. కళ్లెదుట దుర్ఘటనలు జరిగినా కనీసం స్పందించకపోగా బాధితులు నెత్తురోడుతున్నా ఫొటోలు, వీడియోలు తీసుకోవడంతో కాలయాపన చేయడం ఆవేదన మిగులుస్తోంది.గతంలో పాఠశాలల్లో ఉండే మోరల్ క్లాసులు మళ్లీ మొదలుపెట్టాలనే వాదన వినిపిస్తోంది.ఈ ఏడాది మహిళల, పిల్లలపై జరిగిన నేరాలకు సంబంధించి 890 కేసులు నమోదయ్యాయి. పౌరస్పృహ ఉంటే వాటి సంఖ్య చాలా వరకూ తగ్గుతుంది కదా!. ప్రశ్నించే తత్వం తగ్గిపోయింది.ధరలు పెరిగినా ధర్నాలు లేవు.. సమస్యలపై నిలదీసేవారు లేరు.. దీంతో ప్రభుత్వ పాలన తీరు మారింది.

మితిమీరిన యువతరం

ఇటీవల కాలంలో యువత మితిమీరి ప్రవర్తించడం, లెక్కలేనితనం ఎక్కువైనట్టు కనిపిస్తోంది. ఒకప్పుడు పెద్దలను చూస్తే నమస్కరించే సంస్కారం అంతరించే దశకు చేరుకొని బీర్ బాటిళ్లతో ఎదురెళ్లి మంచిచెప్పిన వారిపై తిరగబడుతుండడం చూస్తున్నాం. తల్లిదండ్రుల మాట వినకుండా పెడదారులు పట్టడం ఎక్కువకావడం ఎవరూ కాదనలేని వాస్తవం. మరొకరి స్వార్థ అవసరాలకు యువతను నిర్వీర్యం చేస్తున్న ఘనులూ ఉన్నారు. అందువల్ల రేపటి దేశ భవిష్యత్తుకు పునాదులైన యువత ఇప్పటికైనా మేలుకోవాలి. మంచి లక్ష్యంతో ఈ రోజే తొలి అడుగు వేయాలి. ఈ ఏడాది జిల్లాలో 62 అత్యాచారాలు, 24 హత్యలు జరిగాయని పోలీసులు చెబుతున్నారు. తెరమాటున ఉన్నవాటి లెక్క దేవుడికే తెలియాలి. ఈ అఘాయిత్యాల్లో ఎక్కువగా యువతే ఉంటున్నారనేది గణాంకాలు చెబుతున్న వాస్తవం.

- మార్పు మనతోనే ఆరంభం కావాలి
- గంజాయి వద్దు.. మద్యం మత్తు వద్దు..
- సారాకు చెక్ పెడదాం
- అందరితో కలిసుందాం
- అభివృద్ధి చేసేవారికే ఓటేద్దాం
- ఈ ఏడాది అష్టదిగ్బంధనం చేయాల్సిందే
- కాలగర్భంలో కలిసిన 2023

నిఘా మెలకువగానే ఉందా?

ఈ ప్రశ్నకు సమాధానం చెప్పడం కాస్త కష్టమే. ప్రజల భద్రత,రక్షణలో నిఘా వ్యవస్థకు అత్యంత ప్రాధాన్యం ఉంది. నేరస్తుల అనుపానులు గమనిస్తూ, నేరాలు జరిగే ఆస్కారంపై అప్రమత్తంగా ఉంటూ ఆయా శాఖలను.. ముఖ్యంగా పోలీసులను అప్రమత్తం చేయడం నిఘా విభాగ ప్రధాన విధి. కానీ గంజాయి, నాటుసారా, గేమింగ్, దొంగతనాలు, హత్యలు, అత్యాచారాలు తదితర నేరాల సంఖ్యను పరిశీలిస్తే నిఘా విభాగం పనితనం డొల్లగా మారినట్టు కనిపిస్తోంది. రాజమహేంద్రవరానికి ఎక్కడెక్కడి నుంచో ఎవరెవరో వస్తుంటారు.నిఘా పనితీరు నీరసంగా ఉండడం ఆందోళన కలిగిస్తోంది.

కలిసి ఉంటే కలదు సుఖం..

అందరం కలిసి ఉంటేనే అది సమాజం. ప్రస్తుత సమా జంలో ఎవరికివారే యమునా తీరే. జిల్లాలో ఈ ఏడాది 700 కొట్లాట/గలాటా/దాడి/గొడవ వంటివి పోలీసుల వద్ద నమోదయ్యాయి. పోలీసుల కంట పడనివి పది రెట్లు ఉంటాయి. రాజీమార్గం రాజమార్గమని అంటారు. 'సారీ' అంటే జారిపోయేదేమీ లేదు. కానీ ఈగో అడ్డొచ్చి సమస్యలను కొనితెస్తోంది. సెల్‌ఫోన్లతో పరిచయం ఎక్కువై కుటుంబీకులు కూడా దూరపు బంధువుల్లా కనిపిస్తున్నారు.ఇలాగే కొనసాగితే మనిషి సంఘజీవి నుంచి ఏకజీవిగా మారే ప్రమాదం లేకపోలేదు.



నూతన వత్సర వేడుకల్లో భాగంగా రాజమండ్రిలో జరిగిన ఒక వేడుకలో ఆడి పాడుతున్న మంగ్లీ



సామర్లకోటలో రైలుకు స్వాగతం పలుకుతున్న దృశ్యం

అమృత్ భారత్ రైలుకు స్వాగతం

- సామర్లకోట, రాజమహేంద్రవరంలో ఆగిన రైలు
- లోకో పైలట్‌లకు సత్కారం

సామర్లకోట, డిసెంబరు 31: పశ్చిమబంగాలోని మాల్డా టౌన్ నుంచి బెంగళూరు వెళ్లే అమృత్‌భారత్ ఎక్స్‌ప్రెస్ రైలు సోమవారం ట్రైయల్ రన్‌లో భాగంగా వివిధ స్టేషన్లలో ఆగింది. రాజమహేంద్రవరం, సామర్లకోట, తుని స్టేషన్లలో ఆదివారం రైలుకు పలువురు నాయకులు, అధికారులు స్వాగతం పలికారు. సామర్లకోటలో పలువురు బీజేపీ నాయకులు, రైల్వే అధికారుల ఆధ్వర్యంలో ఘన స్వాగతం లభించింది. స్టేషన్ మేనేజర్ ఎం.రమేష్ ఆధ్వర్యంలో లోకో పైలట్‌లకు శాలువాలు కప్పి పూలమాలలతో ఘనంగా సత్కరించారు. అనంతరం సామర్లకోట నుంచి రైలు రాజమండ్రి వైపునకు వెళ్లేందుకు పచ్చ జెండాలు ఊపడంతో అమృత్‌భారత్ రైలు సామర్లకోట నుంచి బయలుదేరి వెళ్లింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, జెడ్‌ఆర్‌యూసీసీ సభ్యులు యార్లగడ్డ దశరథ రామారావు, రావుల మాధవరావు, యెనిమిరెడ్డి మాలకొండయ్య, పైడా వెంకటనారాయణ, సుంకవిల్లి బాపిరాజు, తుమ్మల పద్మజ, రైల్వే అధికారులు శివప్రసాద్, రవికాంత్, సంతోష్‌కుమార్, రామకృష్ణ, లోవరాజు, కేవీవీ రావు, వర్మ, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు

రాజమహేంద్రవరంలో ఘన స్వాగతం

రాజమహేంద్రవరం, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): మాల్డా నుంచి బెంగళూరు వరకూ నూతనంగా వేసిన 'అమృత్ భారత్' సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలు రాజమండ్రి రైల్వే స్టేషన్‌కు ఆదివారం సాయంత్రం 6.10 గంటలకు చేరుకుంది. బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు సోము వీర్రాజు, ఎంపీ భరత్‌రామ్, రైల్వే అధికారులు స్వాగతం పలికారు. విజయవాడ స్కూలు విద్యార్థులు తయారు చేసిన అమృత్ భారత్ రైలు నమూనా, రైల్వే స్కౌట్ విద్యార్థులు జాతీయ పతాకాలతో ఆకట్టుకున్నారు. రైలు లోపల, బయటా ఆకర్షణీయమైన రంగులు వేశారు. స్లీపర్ బోగీల్లోని టాయిలెట్లలో ఏసీ బోగీల్లో మాదిరి ఏర్పాట్లు చేశారు. ఫైర్ అలార్మింగ్ వంటివి ఉన్నాయి. పుష్ పుల్ టెక్నాలజీతో 6వేల హెచ్‌పీ సామర్థ్యం కలిగిన రెండు వ్యాప్-5 అత్యాధునిక ఇంజన్లు, స్లీపర్, జనరల్ తరగతి బోగీలతో గంటకు గరిష్ఠంగా 130 కిలోమీటర్ల స్పీడుతో అమృత్ భారత్ పరుగులు పెడుతుంది. ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ సైదయ్య, జీఆర్పీ సీఐ విజయ్ శంకర్, టూటౌన్ సీఐ గణేశ్ బందోబస్తు ఏర్పాట్లను పర్యవేక్షించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు కురగంటి సతీశ్, బొమ్ముల దత్తు, హారిక, యానాపు ఏసు, ఇన్‌చార్జి ఎస్ఎస్ శ్రీనివాస్, సీటీఐ చంద్రమౌళి, సీసీఐ కళ్యాణ్, ఏడీఈఎన్ గణేషన్, ఐవోడబ్ల్యు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

7 నుంచి అమృత్ భారత్ రైలు రాకపోకలు

సామర్లకోట, డిసెంబరు 31: పశ్చిమబంగాలోని మాల్డా టౌన్-ఎస్ఎంవీటి బెంగళూరు మధ్య నూతనంగా ప్రవేశపెట్టిన అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ జనవరి 7 నుంచి రాకపోకలు ప్రారంభించనుంది. ఈ ఎక్స్‌ప్రెస్ రైలు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో విజయవాడ, గుంతకల్ రైల్వే డివిజన్ల పరిధిలో 11 ప్రధాన రైల్వే స్టేషన్లలో ఆగనుంది. సామర్లకోట, తుని రైల్వే స్టేషన్లతో పాటు రాజమండ్రి స్టేషన్ కూడా వాటిలో ఉంది. అలాగే ఏలూరు, విజయవాడ, తెనాలి, చీరాల, ఒంగోలు, నెల్లూరు, గూడూరు, రేణిగుంట రైల్వేస్టేషన్లలో ఆగుతుంది. ఈ వీక్లీ ఎక్స్‌ప్రెస్ రైలు మాల్డా టౌన్ నుంచి ప్రతి ఆదివారం, బెంగళూరు నుంచి ప్రతి మంగళవారం ప్రయాణిస్తుంది. వారాంతపు ఎక్స్‌ప్రెస్ రైలుగా అత్యంత వేగవంతమైన, అనుకూలమైన, అత్యంత సౌకర్యవంతమైన ప్రయాణ రైలుగా రైల్వే ఉన్న తాధికారులు తెలిపారు. ఇది పూర్తిగా నాన్-ఏసీ రైలు. స్లీపర్ కోచ్‌లు, జనరల్ కోచ్‌లు ఉంటాయి. 13434 నంబరు గల మాల్డా టౌన్- ఎస్ఎంవీటీ బెంగళూరు రైలు మాల్డా టౌన్ నుంచి ఆదివారం ఉదయం 8.50 నిమిషాలకు బయలుదేరనుంది. ఈ రైలు తుని రైల్వే స్టేషన్‌కు సోమవారం ఉదయం 7.19కి చేరుకుని 7.20కి బయలుదేరుతుంది. సామర్లకోట స్టేషన్‌కు 7.54కి చేరుకుని తిరిగి 7.55కి బయలుదేరుతుంది. రాజమండ్రి స్టేషన్‌కు 8.34కు చేరుకుని తిరిగి 8.36కి చేరుతుంది. బెంగళూరుకు మంగళవారం తెల్ల వారుజామున 3 గంటలకు వెళుతుంది. రైలు నంబరు 13433 ఎస్ఎంవీటి బెంగళూరు-మాల్డా టౌన్ మధ్య ప్రతీ మంగళవారం మధ్యాహ్నం 1.50కి బయలుదేరుతుంది. బుధవారం తెల్లవారుజామున 4.18కి రాజమండ్రి చేరుకుని తిరిగి 4.20కి బయలుదేరుతుంది. సామర్లకోటకు ఉదయం 5.04 కి చేరుకుని తిరిగి 5.05 కి బయలు దేరుతుంది. తుని స్టేషన్‌కు ఉదయం 5.59కి చేరుకుని తిరిగి 6.00 బయలుదేరుతుంది. మాల్డా టౌన్‌కు గురువారం ఉదయం 11 గంటలకు చేరుతుంది. ఈ ఎక్స్‌ప్రెస్ రైలు జనవరి 9న మంగళవారం మధ్యాహ్నం 1.50కి బయలుదేరుతుంది.

ఉత్సాహంగా ఎడ్ల పందేలు



రంగంపేట, డిసెంబరు 31: తెలుగు సాంస్కృతిక వైభవానికి ఎడ్ల పందేలు చిహ్నమని, ఇటువంటి పోటీలను ప్రోత్సహించాలని ఎంపీ మార్గాని భరత్‌రామ్ అన్నారు. రంగంపేట మండలం వడిశలేరులో ఆదివారం గన్ని భాస్కరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి ఎడ్ల పరుగు పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎడ్ల పరుగు పోటీలనేవి మేలుజాతి పశువులను సంరక్షించడానికి మన పూర్వీకులు నుంచి వస్తున్న ఒక సంప్రదాయ పోటీలని తెలిపారు. 1600 మీటర్ల దూరం పరుగు పోటీల్లో సీనియర్ విభాగంలో గుమ్మిలేరుకు చెందిన కోరా శృతిచౌదరి(ప్రథమ), గొల్లప్రోలుకి చెందిన నిమ్మకాయల నూకరాజు, గుమ్మిలేరుకు చెందిన కోరా శృతిచౌదరి (ద్వితీయ), అనకాపల్లి జిల్లా నరసయ్యపేటకు చెందిన ముమ్మిన శివతేజ ఎడ్ల జతలు (తృతీయ) స్థానాల్లో నిలిచాయి. జూనియర్ విభాగంలో మండపేటకు చెందిన వేగుళ్ల రామస్వామి(ప్రథమ), కొవ్వాడకు చెందిన మట్టా నవనీత్ శ్రీమణికంఠ(ద్వితీయ), వన్నెపూడికి చెందిన బవిరిశెట్టి మణి ఎడ్ల జతలు (తృతీయ) స్థానాల్లో నిలిచాయి. విజేతలకు ఎమ్మెల్యే జక్కంపూడి రాజా బహుమతి ప్రదానం చేశారు. సీనియర్ విభాగంలో ప్రథమ విజేతలకు బుల్లెట్ బైక్‌ను, మిగిలిన స్థానాల్లో నిలిచిన వారికి ఎలక్ట్రిక్ బైక్‌లను బహూకరించారు. ముఖ్య అతిథులను భాస్కరరావు సత్కరించారు. కార్యక్రమంలో రుడా చైర్మన్ రౌతు సూర్యప్రకాశరావు, ఎమ్మెల్యేలు డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, గోరంట్ల బుచ్చయ్యచౌదరి, ఓఎన్‌జీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అమిత్‌నారాయణ్, జనసేన నాయకుడు బత్తుల బలరామకృష్ణ, కె.బ్రహ్మజీ, కొల్లాటి ఇజ్రాయిల్, పోతుల బుల్లి వీర్రాజు పాల్గొన్నారు.



విజేతకు బుల్లెట్ బండి బహూకరణ

తెలుగు మహాసభల ఏర్పాట్లు పరిశీలన

రాజానగరం, డిసెంబరు 31: గైట్ కళాశాల ప్రాంగణంలో జనవరి 5వ తేదీ నుంచి జరగనున్న అంతర్జాతీయ తెలుగు మహా సభలు నిర్వహణకు జరుగుతున్న ఏర్పాట్లను రాజమహేంద్రవరం డీఎస్పీ డాక్టర్ ఎం.కిశోర్‌కుమార్, ప్రత్యేక విభాగం డీఎస్పీ రామవర్మ ఆదివారం పరిశీలించారు. అనంతరం చైతన్య విద్యాసంస్థల వ్యవస్థాపకుడు కేవీవీ సత్యనారాయణరాజు (చైతన్యరాజు)తో వారు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 4 నుంచి 8వ తేదీ వరకూ చతుర్వేద మహాయాగంతో పాటు శ్రీవారి వైభవోత్సవం నిర్వహిస్తామన్నారు. అలాగే చైతన్య విద్యాసంస్థలు, ఆంధ్ర సారస్వత పరిషత్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 5 నుంచి 7వ తేదీ వరకూ అంతర్జాతీయ తెలుగు మహాసభలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమాలకు ఐదు రాష్ట్రాల గవర్నర్లు, కేంద్ర, రాష్ట్ర మంత్రులు, పీఠాధిపతులు ముఖ్య అతిథులుగా విచ్చేస్తారని చెప్పారు. రాజానగరం సీఐ పి.కాశీవిశ్వనాథ్, గైట్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఎస్‌వీవీఎస్ఎన్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలి : కలెక్టర్



రాజమహేంద్రవరం, డిసెంబరు 31: 2024లో ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని, ఆయురారోగ్య ఐశ్వర్యాలతో వర్ధిల్లాలని జిల్లా కలెక్టర్ డా. కె. మాధవీలత ఆకాంక్షించారు. జిల్లా ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియచేస్తూ ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. నూతన సంవత్సరంలో ప్రజలంతా తమ తోటి వారితో సామరస్యంగా స్నేహభావంతో మెలగాలని సకల సంపదలు కలగాలని కోరుకున్నారు. రానున్నరోజుల్లో మరింతగా ప్రజలకు మంచి జరగాలన్నారు.

వాడపల్లి ఆలయానికి డీసీ హోదా

ఆత్రేయపురం, డిసెంబరు 31: ఏడు శనివారాల వెంకన్న దర్శనం ఏడేడు జన్మల పుణ్యఫలంగా భక్తుల ప్రగాఢ విశ్వాసం. కోరిన కొర్కెలు తీర్చే కలియుగ దైవంగా బాసిల్లుతున్న శ్రీవారు ఉభయరాష్ట్రాలలో ఎంతగానో ఖ్యాతిని ఆర్జించారు. అంత ఖ్యాతిని అర్జించిన కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయానికి డిప్యూటీ కమిషనర్ హోదా దక్కింది. రాష్ట్ర కేబినెట్‌తీర్మానం మేరకు ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు దేవదాయ శాఖ కమిషనర్ వాడపల్లి వెంకన్న ఆలయానికి డీసీ హోదాను ఇస్తూ ఈ నెల 29న ఉత్తర్వులు జారీ చేశారు. స్వామివారి వార్షిక ఆదాయం రూ.13 కోట్లకు చేరడంతో ఈ హోదా దక్కింది. దేవదాయశాఖ డీసీ హోదాలో పాలన సాగనుంది. భక్తుల సౌకర్యాల కల్పనకు స్వయంగా నిర్ణయాలు తీసుకునే అధికారం ఉంటుంది. పరిపాలన సౌలభ్యం సులభతరం కానుంది. త్వరలోనే ప్రభుత్వ డిప్యూటీ కమిషనర్‌ను నియమించనుంది.

సర్వాంగ సుందరంగా వాడపల్లి ఆలయం



ఆత్రేయపురం,డిసెంబరు 31: కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయం నూతన సంవత్సర వేడుకలకు ముస్తాబైంది. సువాసనలు వెదజల్లే వివిధ రకాల ఫల పుష్పాలతో ఆలయాన్ని సర్వాంగ సుందరంగా అలంకరించారు. పుష్పాలతో అలంకరించి 2024 భక్తులకు స్వాగతం పలుకుతున్నారు. ఓంకారం, శ్రీనివాసుని నామాలు, హనుమ, జై శ్రీరామ్ నినాదాలతో పుష్పాలంకరణ కనువిందు చేసింది. ఫొటోషూట్లను ఏర్పాటు చేస్తున్నారు. వాడవాడలా నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ ముత్యాల ముగ్గులు వేశారు. వివిధ రాజకీయ పార్టీ నాయకులు నూతన సంవత్సర ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. అనంతరం 2023కు వీడ్కోలు పలికారు.

పలు రైళ్లు రద్దు

సామర్లకోట, డిసెంబరు 31: విజయవాడ సమీపాన రైలు ట్రాక్‌పై రోలింగ్ కారిడార్ బ్లాక్ ప్రోగ్రాం, పలు భద్రతా ఏర్పాట్లలో భాగంగా జనవరి 1 నుంచి ఈ సెక్షన్‌లో ఉదయ్, సింహాద్రి ఎక్స్‌ప్రెస్‌లతో పలు రైళ్లను రద్దు చేసినట్లు రైల్వే సీనియర్ ఏటీఎం చార్జి ఏ.సురేష్‌రెడ్డి రైల్వే అధికారులకు ఆదే శాలు జారీ చేశారు. 17239 నంబరు గల గుంటూరు-విశాఖపట్నం మధ్య రాకపోకలు సాగించే సింహాద్రి ఎక్స్‌ప్రెస్ జనవరి 1 నుంచి జనవరి 14 వరకూ రద్దు చేశారు. 17240 నంబరు గల విశాఖపట్నం-గుంటూరు మధ్య రాక పోకలు సాగించే సింహాద్రి ఎక్స్‌ప్రెస్ రైలు జనవరి 1 నుంచి 15 వరకూ రద్దు చేశారు. 22701 నంబరు గల విశాఖ- విజయవాడ మధ్య రాకపోకలు సాగించే ఉదయ్ ఎక్స్‌ప్రెస్ రైలు జనవరి 1,2,3,5,6,8,9,10,12,13 తేదీలలో రద్దు చేశారు. 22702 నంబరు గల విజయవాడ-విశాఖ మధ్య రాకపోకలు సాగించే ఉదయ్ ఎక్స్‌ప్రెస్ రైలు జనవరి 1,2,3,5,6,8,9,10,12,13 తేదీలలో రద్దు చేశారు.

హైకోర్టు న్యాయమూర్తి పూజలు

అన్నవరం, డిసెంబరు 31: ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధిలో ఆదివారం హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ దుర్గాప్రసాదరావు కుటుంబసభ్యులతో స్వామిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనకు ఆలయ పీఆర్వో డీవీఎస్ కృష్ణారావు ఆలయ మర్యాదలతో ఘనస్వాగతం పలికారు. దర్శనానంతరం వేదపండితులు వేదాశీర్వచనాలు అందించగా అధికారులు స్వామి వారి చిత్రపటం, ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఏపీఆర్వో ఎం.గణపతిరావు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ భాస్కరప్రసాద్ తదితరులున్నారు.

జాతీయ స్థాయి తైక్వాండో పోటీలకు ఎంపిక

అంబాజీపేట, డిసెంబరు 31: ఈ నెల 29, 30 తేదీల్లో విజయవాడ ఏపీఎస్ఆర్ఎంసీ హైస్కూల్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీలకు హాజరైన అంబాజీపేట విద్యార్థులు ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. జూనియర్ బాలుర విభాగంలో డి.విజయరాఘవేంద్ర మూడో స్థానంలో నిలిచి కాంస్య పతకం సాధించాడు. సీనియర్ బాలికల విభాగంలో కె.వైష్ణవి, బీహెచ్ఎల్ సౌమ్య (కొరిగి) గోల్డ్‌మెడల్స్, పి.భార్గవిశ్రీకళ, వై.వైష్ణవి గోల్డ్‌మెడల్స్ సాధించారు. జనవరిలో జరిగే జాతీయ స్థాయి తైక్వాండో పోటీల్లో పాల్గొంటారని సీనియర్ కోచ్ పితాని త్రిమూర్తులు తెలిపారు. జాతీయ స్థాయికి ఎంపికైన క్రీడాకారులను పాఠశాలలో అభినందించారు.

కడియం పూల మార్కెట్‌కు కళ

కడియం, డిసెంబరు 31: నూతన సంవత్సర ఆరంభంతో అంతర్జాతీయ పూల మార్కెట్‌కు కళ ఏర్పడింది. అటు పూల వర్తకులు, ఇటు కొనుగోలు దారులు, మరోపక్క పూల రైతులతో మార్కెట్ సందడిగా మారింది. రెండు రోజుల నుంచే రాష్ట్రం నలుమూలలకు పూలు ఎగుమతి అవుతున్నాయి. అయితే ఆదివారం మార్కెట్ మరింత బిజీగా మారింది. ప్రజలు ఇంటి అలంకరణ, దేవుని అలంకరణ, పూజకు పూల దండలు, పువ్వులు కొనుగోలు చేశారు. అలానే ప్రజాప్రతినిధులకు, రాజకీయ పార్టీల నాయకులు, ఉన్నతాధికారులకు, అధికారులకు కిందిస్థాయి ఉద్యోగులు పుష్పగుచ్ఛాలు అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు చెప్పటం ఆనవాయితీ. ఈ నేపథ్యంలో పుష్పగుచ్ఛాలకు డిమాండ్ ఏర్పడింది. కడియం, కడియపులంక గ్రామాల్లో రెండు మూడు రోజుల నుంచి ఆర్కిడ్స్, జర్బెరా తదితర రకాల పూలతో రూ.300 నుంచి రూ.1,500 వరకు పుష్పగుచ్ఛాలు తయారు చేశామని తయారీదారులు చెబుతున్నారు. పూలమార్కెట్‌లో ధరలు ఇలా ఉన్నాయి. లిల్లీ (కిలో) రూ.100, కాగడాలు(కిలో) రూ.500, జాజులు(కిలో) రూ.1,200, పసుపు కుంకుమ, నీలం రకాల చామంతులు(కిలో) రూ.130 నుంచి రూ.80, వైట్ చామంతి (కిలో) రూ.130, స్టార్‌గులాబీ (కిలో) రూ.160, ఎల్లో, కలకత్తా రకాల బంతిపూలు రూ.50 నుంచి రూ.40, కనకంబరం(బారు-1) రూ.300, డచ్ (20పూలు) రూ.300 ధర పలుకుతున్నాయని పూల వర్తకులు తెలిపారు.

అగ్నిప్రమాదంలో రెండిళ్లు దగ్ధం



కాలిపోయిన ఇంటి స్థలంలో బాధితులు

వై.రామవరం, డిసెంబరు 31: మండలంలోని యార్లగడ్డ పంచాయతీ గొరమంద అటవీ ప్రాంతంలో ఉన్న చీడిపాకలు గ్రామంలో ఆదివారం అగ్ని ప్రమాదంలో రెండిళ్లు దగ్ధమయ్యాయి. కోండ్ల రేకమ్మ, వెలుగూరి పండయ్య అనే గిరిజనులకు చెందిన ఇళ్లు ప్రమాదవశాత్తు కాలిపోవడంతో ఇళ్లల్లో ఉన్న ధాన్యం, సోళ్లు, బియ్యం, భూమి పట్టాలు, రేషన్ ఆధార్ తదితర ప్రభుత్వ పత్రాలు కాలిపోయి బాధితులు నిరాశ్రయులయ్యారు. సుమారు రూ. 3 లక్షలు ఆస్తినష్టం ఉంటుందని బాధితులను అన్ని విధాల ఆదుకోవాలంటూ సర్పంచ్ పల్లాల పద్మావతి అధికారులను కోరారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ పల్లాల వెంకటరమణారెడ్డి పాల్గొన్నారు.

పనిచేయని సిగ్నలింగ్: ఇబ్బందులు

అడ్డతీగల, డిసెంబరు 31: అడ్డతీగలలోని భారత్ సంచార్ నిగమ్ (బీఎస్ఎన్ఎల్) టవర్లు పనిచేయక వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఫిర్యాదు చేద్దామంటే అధికారులు ఎవరూ అందుబాటులో ఉండడం లేదని వినియోగదారులు చెబుతున్నారు. కార్యాలయం గేట్లు ఎల్లప్పుడూ మూసే ఉంటాయని స్థానికులు వాపోతున్నారు. సెల్‌ఫోన్లు, ల్యాండ్ లైన్లు, నెట్‌వర్క్ పూర్తిగా పనిచేయకపోవడంతో ఆదివారం అడ్డతీగల నుంచి 16 కిలోమీటర్ల దూరంలో ఉన్న గంగవరం మండలం వెళ్లి నెట్‌వర్క్ ఉపయోగించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. గత 20 రోజుల నుంచి 12 రోజుల పాటు పూర్తిస్థాయిలో బీఎస్ఎన్ఎల్ సేవలు పనిచేయకపోవడం వల్ల ఇబ్బందులు తప్పలేదని వినియోగదారులు చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

85 శాతం హామీలు నెరవేరలేదు

టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి

అనపర్తి, డిసెంబరు 31: వైఎస్ జగన్ పాదయాత్రలో ఇచ్చిన హామీలు 99శాతం నెరవేర్చామంటూ ప్రజలను మభ్య పెడుతున్నారని.. అయితే 85శాతం హామీలు నెరవేర్చలేదని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. అనపర్తిలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నవరత్నాల పేరుతో 199 హామీలు ఇచ్చారని వీటిలో 17 పూర్తిగాను, 43 పాక్షికంగాను అమలు చేశారని, 109 హామీలు పూర్తిగా అమలు కాలేదన్నారు. పాదయాత్రలో రాష్ట్ర స్థాయిలో ఇచ్చిన 51 హామీల్లో ఒకటి పూర్తిగాను, ఆరు పాక్షికంగాను అమలు చేయగా 44 గాలికి వదిలేశారన్నారు. నియోజకవర్గాలకు సంబంధించి 480 హామీలు ఇవ్వగా వాటిలో మూడు పాక్షికంగాను, 9 పాక్షికంగాను నెరవేర్చగా 468 నెరవేర్చలేదన్నారు. బిక్కవోలు మండలం బలభద్రపురంలోని కేపీఆర్ కెమికల్ ఫ్యాక్టరీని బంగాళాఖాతంలో కలుపుతానని హామీ ఇచ్చి ఇప్పుడు గ్రాసిం ఇండస్ట్రీగా పేరు మార్చి స్వయంగా ముఖ్యమంత్రే ప్రారంభించారన్నారు. మోసపూరిత హామీలు ఇచ్చి రాష్ట్రంలో యువతకు ఉద్యోగావకాశాలు లేకుండాను, పరిశ్రమలు రాకుండా చేసి రాష్ట్రాన్ని నాశనం చేశాన్నారు. ఈ సందర్భంగా జగన్‌రెడ్డి ఇచ్చిన హామీలు 85శాతం అమలు కాలేదని వివరిస్తూ ప్రచురించిన బుక్‌లెట్లను ప్రదర్శించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు సిరసపల్లి నాగేశ్వరరావు, తమలంపూడి సుధాకరరెడ్డి, నల్లమిల్లి సుబ్బారెడ్డి, కర్రి వెంకటరెడ్డి, నూతిక బాబూరావు, ఒంటిమి సూర్యప్రకాష్, నల్లమిల్లి శ్రీనివాసరెడ్డి, గొలుగూరి వీర్రాఘవరెడ్డి, బాసి పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నల్లమిల్లి రామకృష్ణారెడ్డి తదితరులు

ఆదివాసీ హక్కుల పరిరక్షణకు సమష్టిగా పోరాడాలి

వై.రామవరం, డిసెంబరు 31: ఆదివాసీ హక్కుల సాధన, చట్టాల పరిరక్షణకు ఆదివాసీలంతా సమష్టిగా పోరాడాలని ఆదివాసీ చైతన్య వేదిక సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు వెదుళ్ల లచ్చిరెడ్డి తెలిపారు. ఆదివారం స్థానిక జడ్పీ పాఠశాల ఆవరణలో సంఘం రెండో ఆవిర్భావ దినోత్సవ మహాసభ నిర్వహించారు. ఆదివాసీలకు అందాల్సిన హక్కులను ప్రభుత్వాలు కాలరాస్తున్నాయని, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులను దారిమళ్లించి అభివృద్ధిని నిర్వీర్యం చేస్తున్నారని ఆరోపించారు. ఎవరో స్క్రిప్ట్ రాస్తే అసెంబ్లీలో మాట్లాడే ఎమ్మెల్యేలు గిరిజనుల అభివృద్ధికి పనిచేయడం లేదని ఎద్దేవా చేశారు. ఆదివాసీలకు చెందిన ఏడు తెగల గిరిజనులు ఐక్యంగా పనిచేసి హక్కులను సాధించుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పల్లాల బాలురెడ్డి, సంఘం జిల్లా కార్యదర్శి మడిగొంట వెంకటేశ్వరులు, జాయింట్ సెక్రటరీ వంతు బాలకృష్ణ, సభ్యులు గంప నాగరాజు, మండల అధ్యక్షుడు ముర్ల సూరిబాబు, జిల్లా కో-కన్వీనర్ గుడ్ల త్రిమూర్తులు, కోశాధికారి పల్లాల లింగారెడ్డి, గ్రామ అధ్యక్షులు పుడిగి లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.



ఐక్యతను చాటుతున్న నాయకులు

పాపికొండల టూర్‌కు పర్యాటకులు



దేవీపట్నం, డిసెంబరు 31: పాపికొండల అందాలను తిలకించేందుకు ప్రకృతి ప్రేమికులు ఆదివారం పాపికొండలకు వెళ్లారు. 7 బోట్లలో సుమారు 530 మంది పర్యాటకులు మండల పరిధిలో ఉన్న పోచమ్మగండి బోటు పాయింటు నుంచి గోదావరి పరివాహక ప్రాంతాల మీదుగా పాపికొండలు వెళ్లారు.

అగ్నిప్రమాద బాధితులకు దాతల సాయం

కూనవరం/వరరామచంద్రపురం, డిసెంబరు 31: వివిధ అగ్ని ప్రమాదాల్లో బాధితులకు దాతలు సాయం అందించారు. వీఆర్ పురం మండలం సీతంపేట గ్రామంలో ఇటీవల ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదంలో ముత్యాల వెంకటేశ్వరులు అనే వ్యక్తి ఇళ్లు పూర్తిగా దగ్ధం అవ్వడంతో చింతూరుకు చెందిన ఆయుర్వేద వైద్యులు జమాల్‌కాన్ రూ.32 వేలు విలువైన సిమెంట్ రేకులు, ఇంటి పైకప్పుకు సంబంధించిన పైపులు అందించారు. అలాగే కూనవరం మండలం అయ్యవారి గూడెం గ్రామంలో పైద సీతమ్మ ఇల్లు కాలిపోవడంతో వారికి న్యాయవాది రూ.1000తో పాటు నిత్యావసర సరుకులు అందించారు.

కేక్ తేవడానికి వెళ్లి.. యువకుడి మృతి



గోకవరం, డిసెంబరు 31: కేక్ తీసుకురావడానికి వెళ్లిన యువకుడు రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. గోకవరం మండలం అచ్యుతాపురానికి చెందిన గోక ఏసురాజు(29) తాపీపనికి వెళుతుంటాడు.నూతన సం వత్సరం వేడుకల నేపథ్యంలో ఆదివారం ఉదయం నుంచి స్నేహితులతో ఆనందంగా గడిపాడు. నూతన సంవత్సరంలో కేక్ కట్ చేద్దామని తెచ్చేందుకు రాత్రి 10 గంటల సమయంలో కొరుకొండ వెళ్లాడు. తిరుగుప్రయాణంలో గుమ్మళ్ల దొడ్డి వద్ద పోలీసులు బ్లాక్‌స్పాట్ గుర్తించి ఏర్పాటు చేసిన డ్రమ్మును బైక్‌తో ఢీకొని అదుపుతప్పి కిందపడి అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అం దుకున్న స్నేహితులు మృతదేహం వద్దకు చేరుకుని బోరున విలపించారు. ఏసు రాజు మృతితో అచ్యుతాపురంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

ఆదివాసీ సంక్షేమ పరిషత్ ఆవిర్భావ దినోత్సవం



జెండాను ఆవిష్కరిస్తున్న దృశ్యం

ఎటపాక, డిసెంబరు 31: ఆదివాసీ సంక్షేమ పరిషత్ ఆవిర్భవించి 33 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా ఆదివారం వేడుకలను పురుషోత్తపట్నంలో నిర్వహించారు. కాక రాజు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆదివాసీ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి పూసం శ్రీను కొమరం భీం చిత్రపటానికి పూల మాలలు వేసి నివా ళుర్పించారు. అనంతరం ఆదివాసీ జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పూసం శ్రీను మాట్లాడారు. ఆదివాసీ సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో చేపట్టిన అనేక పోరాటాలతో ఆదివాసీ యువతకు విద్యా, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు దక్కాయని అన్నారు. 2008,2022 సంవత్సరాల్లో పోలవరం నిర్వాసితులకు ఇంటి స్థలాలు ఇవ్వాలని భూపోరాటం చేశామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏటీఏ జిల్లా ప్రధాన కార్యదర్శి కణితి రామకృష్ణ, నూప అనిల్, ఇరకం కాంతారావు, ఆదివాసీ సంక్షేమ పరిషత్ జిల్లా కార్యదర్శి కూర నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల రాస్తారోకో



మానవహారంగా ఏర్పడ్డ అంగన్‌వాడీలు

రాజవొమ్మంగి డిసెంబరు 31: రాజవొమ్మంగిలో ఆదివారం కూడా అంగన్వాడీ వర్కర్ల నిరసన దీక్ష కొనసాగింది. దీక్ష శిబిరం వద్దే నూతన సంవత్సర వేడుకలను అంగన్వాడీ వర్కర్లు జరుపుకున్నారు. సీఐటీయూ నాయకుడు పి.రామరాజు, అంగన్వాడీ యూనియన్ నాయకురాలు కె.వెంకటలక్ష్మి, చిన్ని కుమారి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అనంతరం రాజవొమ్మంగి అల్లూరి కూడలి వరకు భారీ ర్యాలీగా వెళ్లి అల్లూరి కూడలి వద్ద మానవహారంగా ఏర్పడి రాస్తారోకో చేశారు. సమస్యలు పరిష్కరించాలంటూ నినదించారు. రోడ్డుపైనే కోలాటమాడారు.

వాహనం ఢీకొని విద్యార్థి మృతి



మారేడుమిల్లి, డిశంబరు 31: అల్లూరి సీతారామరాజుజిల్లా మారేడుమిల్లి మండలంలో గుర్తుతెలియని వాహనం ఢీకొని ఇంటర్ విద్యార్థి మృతిచెందాడు. మారేడుమిల్లి ఏపీఆర్ గురుకుల జూనియర్ కాలేజీలో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం చదువుతున్న అడ్డతీగల మండలానికి చెందిన నేరం సత్యవరప్రసాద్(16) ఆదివారం రాత్రి స్నానం సబ్బు తెచ్చుకోవడం కోసం కాలేజీ బయట ఉన్న కిళ్లీషాపుకు వెళ్లి వస్తుండగా పెట్రోల్ బంక్ సమీపంలో కారు అతివేగంగా వచ్చి బలంగా ఢీకొట్టింది. ఈ సంఘటనలో విద్యార్థి అపస్మారక స్థితికి చేరుకోగా ఆసుపత్రికి తీసుకువెళుతుండగా మృతిచెందాడు. దీనిపై మారేడుమిల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

'దుర్గేష్ అందుబాటులో ఉండరు'

రాజమహేంద్రవరం రూరల్, డిసెంబరు 31: జనసేన పార్టీ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు, రాజమహేంద్రవరం రూరల్ ఇన్‌చార్జి కందుల దుర్గేష్ సతీమణి ఉష అనారోగ్యం కారణంగా దుర్గేష్ హైదరాబాదులో ఉన్నారు. ఈ కారణంతో దుర్గేష్ జనవరి 1వ తేదీన రాజమహేంద్రవరంలో అందుబాటులో ఉండరు. పార్టీ శ్రేణులు, అభిమానులు, గుర్తించాలని జనసేన పార్టీ రూరల్ కార్యాలయం నుంచి ఓ ప్రకటనను విడుదల చేశారు.

తూర్పుగోదావరి

• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి • కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం

రాజమహేంద్రవరంలో జగ్గయ్యకు నివాళి

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 31: కొంగర జగ్గయ్య (కంచుకంఠం జగ్గయ్య) జయంతిని రాజమహేంద్రవరంలో నిర్వహించారు. అక్కినేని నాగేశ్వర రావు అభిమాని మరిడయ్య ఆధ్వర్యంలో జగ్గయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఆదివారం నివాళులర్పిం చారు.ఈ కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాది మిర్తిపాటి శేషగిరిరావు, సుక్కిరెడ్డి శ్రీనివాసరావు, గిరిజాల సోమరాజు నాయుడు, గర్లంక రమేష్, కొవ్వూరి శేషారెడ్డి, నల్లా త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.









సమ్మెకు దిగే కార్మికులను బెదిరించొద్దు

మునిసిపల్, ఏఐటీయూసీ నాయకులు


రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 31: ఈ నెల 3న జరిగే సమ్మె నేపథ్యంలో మునిసిపల్ కార్మికులను అధికారులు బెదిరింపులకు గురిచేయ్యడం సరికాదని మునిసిపల్, ఏఐటీయూసీ నాయకులు అన్నారు. రాజమహేంద్రవరం తాడితోట గుడిలో ఆదివారం ఏపీ మునిసిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు సంగిరెడ్డి రమణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా నాయకులు తాటిపాక మధు, కూండ్రపు రాంబాబు మాట్లాడారు. మునిసిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఆ సంఘాల జేఏసీ జనవరి 3న నుంచి సమ్మెకు పిలుపునిచ్చినట్టు చెప్పారు. కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు మంజూరు చేయాలని, టైమ్‌స్కేల్ ఉద్యో గులు కార్మికులను పర్మినెంట్ చేయాలని, కొవిడ్ విపత్తులో తీసుకున్న కార్మికులను యథావిధిగా కొనసాగించాలనే తదితర డిమాండ్ల సాధనకై సమ్మెకు వెళుతున్నట్టు తెలిపారు. సమావేశంలో దుర్గమ్మ ,అల్లం వెంకటేశులు, బంగారు నాగేశ్వరరావు, ముత్యాలు మురళీ, అల్లం బాలు, కాకి శారద, ముత్యాలు నందకిషోర్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఐ నాగరాజుకు ఉత్తమ ప్రతిభా అవార్డు

నిడదవోలు, డిసెంబరు 31: నిడదవోలు పట్టణ ఎస్ఐ పి.నాగరాజుకు రాజమహేంద్రవరంలో జిల్లా ఎస్పీ జగదీష్ ఉత్తమ ప్రతిభా అవార్డు అందజేశారు. 2023లో మిస్సింగ్ కేసులను త్వరగా పరిష్కరించి శాంతి భద్రతల పరిరక్షణా చర్యల్లో భాగంగా బైండోవర్ కేసులు నమోదు చేసి నందుకు నాగరాజుకు అవార్డు అందజేశారు. ఆయనతోపాటు సీఐ కె.వెంకటేశ్వరరావు, ఏఎస్ఐ కోటేశ్వరరావు, కాని స్టేబుల్ పి.శ్రీనివాస్‌కు అవార్డులు అందించారు.




















కనకదుర్గమ్మ తీర్థం

రాజానగరం/ దివాన్‌చెరువు, డిసెంబరు 31: మండలంలోని చక్రద్వార బంధం-సూర్యారావుపేట పరిధిలో ఉన్న కనకదుర్గమ్మ తీర్థ మహోత్సవం ఆదివారం కన్నులపండువగా సాగింది. ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బొడ్డు వెంకటరమణచౌదరి అమ్మవారిని దర్శించుకున్నారు. అలాగే పరిసర గ్రామాల భక్తులు తరలివచ్చి బారులు దీరి అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులు చెల్లించుకున్నారు. జాతీయ రహదారిని ఆనుకుని దుర్గమ్మ ఆలయం ఉండడం, అక్కడే తీర్థం జరగడంతో వాహనాల రాకపోకలను పోలీసులు క్రమబద్ధీకరించారు. ఎస్ఐ పి.కాశీవిశ్వనాథ్ ఆధ్వర్యంలో ఆలయం వద్ద గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. అలాగే మండలంలోని పాతతుంగపాడులో గ్రామ దేవత కనకదుర్గమ్మ జాతర జరిగింది. అధికసంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శిం చుకుని మొక్కుబడులు చెల్లించుకున్నారు. కొందరు తులా భారం సమర్పించుకున్నారు. ఆలయం వద్ద కాళీకానృత్యం, కోలాటం, భజన జరిగాయి. అలాగే శ్రీకృష్ణపట్నంలో కనక దుర్గమ్మ జాతర నిర్వహించారు.

కోరుకొండ: మధురపూడిలో జరిగిన జాతరలో దుర్గమ్మను ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బొడ్డు వెంకటరమణచౌదరి, జనసేన ఇన్‌చార్జి బత్తుల వెంకటలక్ష్మి, బీజేపీ ఇన్‌చార్జి నీరుకొండ వీరన్నచౌదరి, జడ్పీటీసీ కర్రి నాగేశ్వరరావు దర్శించుకుని పూజలు చేశారు. ప్రముఖులందరిని ఆలయ కమిటీ సత్కరించింది.

వేమగిరిలో క్రిస్మస్ వేడుకలు

కడియం, డిసెంబరు 31: వేమగిరి కొత్తపేటలో ది మోడ్రన్ ట్రూత్, యూత్ లీగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. పాస్టర్ ప్రేమ్‌నాథ్ వాక్యసందేశం వినిపించారు. క్రిస్మస్ కేకు కట్ చేశారు. మాజీ సర్పంచ్ వెలుగుబంటి నాని ముఖ్య అతిథిగా విచ్చేసిన ఈ కార్యక్రమంలో మెల్లిమి భాస్కరరావు, పులిదిండి మధుకుమార్, మెల్లిమి క్రాంతిప్రకాష్, బీరా బాబూరావు పాల్గొన్నారు.




దత్తత విద్యార్థికి ఆర్థిక సాయం

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 31: ఆక్స్‌ఫర్డ్ స్కూల్‌లో 5వ తరగతి చదువుతున్న ఎం.సుకుమార్ అనే పేద విద్యార్థికి చదువు నిమిత్తం టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఆదిరెడ్డి శ్రీనివాస్ ఆర్థిక సాయం చేశారు.


















యువతరం సోషల్ మీడియాతో చిత్తవుతోంది. వాటిని వీడాలని కొవ్వూరుకు చెందిన సుస్మిత వేసిన ముగ్గు ఆలోచింపజేసింది..



ఎనిమిదింతల ఆనందం కావాలి...

2023 వెళ్లిపోయింది.. మరో ఏడాది కాలగర్భంలో కలిసిపోయింది.. 2024లోకి వచ్చేశాం..ఈ ఏడాది ఎలా ఉండాలి.. ప్రతి ఒక్కరిదీ ఒకటే ఆశ.. అంతా బాగుండాలి.. అలా బాగుండాలంటే ఏం ఉండాలి.. ప్రతి కుటుంబం ఆదాయం రెండింతలు పెరగాలి.. బాధలు..నష్టాలు.. కష్టాలు.. జీరోగా ఉండాలి.. వ్యయం రెండింతలు తగ్గాలి.. ఇలాగైతేనే నాలుగింతల ఆనందం పొందుతాం.. అంతా బాగుంటాం.. ఇదీ జనం ఆలోచన.. ఎందుకంటే 2023 లో అన్నీ కష్టాలు.. బాధలే.. అన్నదాతకు ప్రకృతి వైపరీత్యాలు.. జనానికి ధరాఘాతం.. ఎన్నికల ఏడాది కావడంతో రాజకీయ నాయకులకు అంతంతమాత్రంగానే ఉంది.2024లో ఇలా కాదు.. ఆనందంగా.. సంతోషంగా గడవాలని కోరుకుంటున్నారు. ఆంధ్రజ్యోతి కూడా అందరికీ 2024 ఆనందాన్ని పంచాలని.. కడియపులంక పల్ల గణపతి నర్సరీలో ఏర్పాటు చేసిన విరివనాలతో నూతన సంవత్సర శుభాకాంక్షలు చెబుతోంది..!!

ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలి : కలెక్టర్

రాజమహేంద్రవరం, డిసెంబరు 31: 2024లో ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని, ఆయురారోగ్య ఐశ్వర్యాలతో వర్ధిల్లాలని జిల్లా కలెక్టర్ డా. కె. మాధవీలత ఆకాంక్షించారు. జిల్లా ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియచేస్తూ ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. నూతన సంవత్సరంలో ప్రజలంతా తమ తోటి వారితో సామరస్యంగా స్నేహభావంతో మెలగాలని సకల సంపదలు కలగాలని కోరుకున్నారు. రానున్నరోజుల్లో మరింతగా ప్రజలకు మంచి జరగాలన్నారు.

కేక్ తేవడానికి వెళ్లి.. యువకుడి మృతి



గోకవరం, డిసెంబరు 31 : కేక్ తీసుకురావడానికి వెళ్లిన యువకుడు రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. గోకవరం మండలం అచ్యుతాపురానికి చెందిన గోక ఏసురాజు(29) తాపీపనికి వెళుతుంటాడు.నూతన సంవత్సరం వేడుకల నేపథ్యంలో ఆదివారం ఉదయం నుంచి స్నేహితులతో ఆనందంగా గడిపాడు. నూతన సంవత్సరంలో కేక్ కట్ చేద్దామని తెచ్చేందుకు రాత్రి 10 గంటల సమయంలో కొరుకొండ వెళ్లాడు. తిరుగుప్రయాణంలో గుమ్మళ్ల దొడ్డి వద్ద పోలీసులు బ్లాక్‌స్పాట్ గుర్తించి ఏర్పాటు చేసిన డ్రమ్మును బైక్‌తో ఢీకొని అదుపుతప్పి కిందపడి అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న స్నేహితులు మృతదేహం వద్దకు చేరుకుని బోరున విలపించారు. ఏసు రాజు మృతితో అచ్యుతాపురంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

3న సర్పంచ్‌ల సమర శంఖారావం

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 31 : మంగళగిరి సీకే కన్వెన్షన్‌లో ఈనెల 3న సర్పంచ్‌ల సమర శంఖారావం నిర్వహిస్తున్నామని జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు పాలడుగుల లక్ష్మణరావు తెలిపారు. రాజమహేంద్రవరం హోటల్ జగదీశ్వరిలో ఆదివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏపీ సర్పంచుల సంఘం, పంచాయితీరాజ్ ఛాంబర్‌ల ఆధ్వర్యంలో సదస్సు జరుగుతుందన్నారు. సర్పంచ్, జడ్పీటీసీలు, ఎంపీటీసీలు, ఎంపీపీలు తరలిరావాలని పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్ పంచాయతీ రాజ్ ఛాంబర్ రాష్ట్ర అధ్యక్షుడు వైవీబీ రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో జరిగే సదస్సుకు ప్రతిపక్ష నేత, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హాజరవుతారని చెప్పారు. సమావేశంలో సర్పంచ్‌లు సంఘం నాయకులు జెట్టి బంగారయ్య (జనసేన), సర్పంచ్ మేకా శ్రీనివాస్, సర్పంచ్ ఉప్పులూరి ముని ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రాజమహేంద్రిలో జరిగింది అవినీతే..

ఆర్‌పీసీ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు మేడా

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 31: రాజమహేంద్రవరంలో జరిగింది అభివృద్ధికాదని అంతా అవినీతే జరిగిందని రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు మేడా శ్రీనివాస్ అన్నారు. రాజమహేంద్రవరం ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజమహేంద్రవరం అభివృద్ధి పాలకులకు పట్టలేదన్నారు. డ్రైనేజీలు అస్తవ్యస్తంగా ఉన్నాయని, మురుగునీరు గోదావరిలో కలిసి దానిని మళ్లీ లిఫ్ట్ చేస్తే నగర ప్రజలు తాగుతున్నారన్నారు. గోదావరి కాలుష్య నియంత్రణ సాధ్యం కాలేదని ధ్వజమెత్తారు. అధికార పార్టీ వారు నగరంలో ఎక్కడ అభివృద్ధి చేశారో చెప్పాలని ప్రశ్నించారు. రానున్న ఎన్నికల్లో రాష్ట్రీయప్రజాకాంగ్రెస్ పార్టీని గెలిపిస్తే అభివృద్ధి, పారదర్శకత ఎలా ఉంటుందో చూపిస్తామన్నారు.అనంతరం ఆర్‌పీసీ మేనిఫెస్టోను విడుదల చేశారు. సమావేశంలో పెండ్యాల కామరాజు, సిమ్మా దుర్గారావు, కాసా రాజు, డీవీ రమణమూర్తి, కె.యుగంధర్, సత్తి వెంకటరెడ్డి, ఎండీ ఇక్బాల్, ఆర్‌కే చెట్టి, దుడ్డె త్రినాథ్, సాయిదుర్గాప్రసాద్, లంక దుర్గాప్రసాద్, బర్ల ప్రసాద్, బి.సోనియా పాల్గొన్నారు.

ఆధార్ నవీకరణకు పోస్టల్ ప్రత్యేక కౌంటర్

రాజమహేంద్రవరం, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): ఆధార్ కార్డు జారీ చేసి పదేళ్లు దాటినా ఒక్కసారి కూడా మార్పులు చేర్పులు చేయనివారు తప్పనిసరిగా నవీకరించుకోవాలని రాజమండ్రి తపాలా డివిజన్ సూపరింటెండెంట్ పి.కోమల్ కుమార్ తెలిపారు.ఈ మేరకు నగరంలోని శ్యామలా సెంటర్ పోస్టాఫీసులో ప్రత్యేక ఆధార్ కౌంటరును ఈ నెల 1 నుంచి 6వ తేదీ వరకూ ఏర్పాటు చేశామన్నారు. సాయంత్రం 4.30 గంటల నుంచి రాత్రి 7.30గంటల వరకూ కౌంటరు పనిచేస్తుందన్నారు.మార్పులకు రుసుం చెల్లించాలన్నారు.

చామంతి కిలో రూ.130

- జాజులు రూ.1200.. పుష్పగుచ్ఛాలకు డిమాండ్
- పూలమార్కెట్‌కు నూతన సంవత్సర శోభ

కడియం, డిసెంబరు 31: నూతన సంవత్సర ఆరంభంతో అంతర్జాతీయ పూల మార్కెట్‌కు కళొచ్చింది. అటు పూల వర్తకులు, ఇటు కొనుగోలుదారులు, మరో ప్రక్క పూలరైతులుతో మార్కెట్ సందడిగా మారింది. రెండు రోజుల నుంచే రాష్ట్రం నలుమూలలకు పూలు ఎగుమతి అవుతున్నాయి. అయితే ఆదివారం మార్కెట్ మరింత బిజీగా మారింది.పుష్పగుచ్ఛాలకు డిమాండ్ ఏర్పడింది. కడియం, కడియపులంక గ్రామాల్లో రెండుమూడు రోజుల నుంచి ఆర్కిడ్స్, జర్బేరా తదితర రకాల పూలతో రూ.300 నుంచి రూ.1,500 వరకు పుష్పగుచ్ఛాలు తయారు చేశామని తయారీదారులు చెబుతున్నారు.కడియపులంక పూలమార్కెట్‌లో ధరలు ఇలా ఉన్నాయి. లిల్లీ (కిలో) రూ.100, కాగడాలు(కిలో) రూ.500, జాజులు(కిలో) రూ.1,200, పసుపు కుంకుమ, నీలం రకాల చామంతులు(కిలో) రూ.130 నుంచి రూ.80, వైట్ చామంతి(కిలో) రూ.130, స్టార్‌గులాబీ(కిలో) రూ.160, ఎల్లో, కలకత్తా రకాల బంతిపూలు రూ.50 నుంచి రూ.40, కనకాంబరం(బారు-1) రూ.300, డచ్ (20 పూలు) రూ.300 ధర పలుకుతున్నాయని పూల వర్తకులు తెలిపారు.



- మార్పు మనతోనే ఆరంభం కావాలి
- గంజాయి వద్దు.. మద్యం మత్తు వద్దు..
- సారాకు చెక్ పెడదాం
- అందరితో కలిసుందాం
- అభివృద్ధి చేసేవారికే ఓటేద్దాం
- ఈ ఏడాది అష్టదిగ్బంధనం చేయాల్సిందే
- కాలగర్భంలో కలిసిన 2023

2023 గడచిపోయింది.. కాలగర్భంలో కలిసిపోయింది.. ఎన్నో విషాదాలు.. మరెన్నో సంతోషాలు.. చివరిలో ఆందోళనలు.. 2023 ఏదో అలా గడచిపోయిందంతే.. మరీ 2024 ఎలా ఉండాలనుకుంటున్నారు.. మార్పు రావాలంటే మనం మారాలంతే..2024 అదే చెబుతోంది.. మార్పు అనేది మనతోనే ఆరంభంకావాలి.. రాజకీయంగా మనకు ఎవరు కరెక్ట్ అనేది తేల్చుకోవాల్సిన ఏడాది ఇది.. ఎందుకంటే ఎన్నికలు ఉండేది ఈ ఏడాదే.. మనం ఎలా బతకాలి అనేది మనమే నిర్ణయించుకోవాలి.. గంజాయి మత్తు వీడాలి.. సారా.. మనసారా.. వదిలేయాలి.. మన భద్రత మనమే చూసుకోవాలి.. అందరితో కలిసుండాలలి.. సమస్యలపై ప్రశ్నించాలి.. యువతరానికి ఒక లక్ష్యం ఉండాలి.. ఈ ఏడాది ఇలాంటి మార్పు రావాల్సిందే..

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

ఆప్యాయతకు మారుపేరు.. పరదాలా పరిచిన పచ్చదనం.. గోదారమ్మ ఒడిలో ఆహ్లాదంగా సాగిపోయే జీవనం.. ఇదీ మూడు ముక్కల్లో తూర్పుగోదావరి జిల్లా ఘనత. కానీ గత నాలుగేళ్లుగా ప్రశాంతాన్ని అశాంతి శాసిస్తోంది. సీఐ స్థాయి అధికారులు సైతం చోటామోటా నాయకుల మాటలు వినితీరాల్సిన పరిస్థితి దాపురించింది. కారణాలేమైనా అతి శృతిమించి సాధారణ జనజీవనాన్ని భయాందోళనలకు గురి చేస్తోంది. ఈ ఏడాది జిల్లాలో అన్ని రకాల నేరాలూ తగ్గాయని గణాంకాలను చూసి మురిసిపోతున్నా వాస్తవాలు మాత్రం మౌనంగా వెక్కిరిస్తున్నాయి.పోలీసు నిఘా నిద్దరోతుండడం.. నిఘా శాఖ(ఇంటెలిజెన్స్) రాజకీయ ఫీడ్‌బ్యాక్‌లకు మాత్రమే పరిమితం కావడం ప్రజల పాలిట శాపంగా మారాయనే ఆరోపణలు వినవస్తున్నాయి.మరోవైపు పౌరస్పృహ పట్టు తప్పడం.. సామాజికస్పృహ చల్లారిపోవ డం వం టివి నిశ్శబ్ద ప్రమాదాలుగా పరిణ మించాయి.ఈ పరిస్థితులు '2024'లో వ్యక్తిగతంగా.. సామాజికపరంగా.. రాజకీయంగా కచ్చితంగా 'మార్పు కావాలి' అని ఘోషిస్తున్నాయి.

రాజకీయం..

ఈ సారి మాత్రం కొత్త సంవత్సరానికి మరింత ప్రాధాన్యత ఉంది.2024 జనవరి వేడుకలకు రాజకీయ ప్రత్యేకత ఉంది. కొద్దినెలల్లోనే సార్వత్రిక ఎన్నికలు జరగనున్నాయి.ప్రధాన రాజకీయ పార్టీలన్నీ అధికారంలోకి రావాలని ఉవ్విళ్లూరుతున్నాయి.ఈ సారి తెలుగదేశం- జనసేన పార్టీ పొత్తుతో నాయకులు,కార్యకర్తల్లో జోష్ పెరిగింది. అధికారం చేజిక్కించుకునేందుకు ఇప్పటికే కదన రంగంలోకి దూకారు.. మీ భవిష్యత్ మాదంటూ ఇంటింటా పలకరిస్తున్నారు. ఇదిలా ఉండగా అధికార వైసీపీ మరోసారి అధికారం కైవసం చేసుకోవాలని భావిస్తోంది. కానీ గతంలో ఏ అధికార పార్టీకి లేనంత ప్రజ్యాతి రేకతను వైసీపీ ప్రభుత్వం మూటకట్టుకుంది.. జిల్లాలో ఒక పార్లమెంట్, ఏడు అసెంబ్లీ స్థానాలు ఉన్నాయి. ప్ర స్తుత రాజకీయ సమీకరణలు పూర్తిగా మారాయి. త్వర లో జరగనున్న సార్వత్రిక ఎన్నికలకు తెలుగుదేశం- జనసేన పార్టీలు సన్నద్ధమవుతున్నాయి. గత ఎన్నికల్లో ఈ రెండు పార్టీలు వేర్వేరుగా పోటీ చేసి దెబ్బతిన్న సంగతి తెలిసిందే. మరోసారి ఆ తప్పు జరగకూడదనే జతకట్టాయి.వైసీపీ ప్రభుత్వ వ్యతిరేక ఓట్లు చీలకూ డదనే లక్ష్యంతో పవన్ ముందుకు వచ్చిన సంగతి తెలిసిందే. ఇంకా ఈ రెండు పార్టీల మధ్య సీట్లు అధికారికంగా ఖరారు కాలేదు. కానీ ఇప్పటికే ఒక ఒప్పందం కుదిరినట్టు ప్రచారం జరుగుతోంది. సిట్టింగ్ ఎమ్మెల్యేలకు టికెట్లు పదిలమేనని గతంలోనే చంద్రబాబు ప్రకటించిన నేపథ్యంలో అర్బన్, రూరల్ ఎమ్మెల్యేల స్థానాలు పది లమేనని చెప్ప వచ్చు.మిగిలిన స్థానాల సంగతి తేలాల్సి ఉంది. వైసీపీలో తీవ్ర గందరగోళం నెలకొంది.ఇప్పటికే సిటీ, రూరల్ స్థానాలకు కోఆర్డినేటర్లను కాదని అభ్యర్థులను మార్చి వేసిన సంగతి తెలిసిందే..ఈ నేపథ్యంలో మిగిలిన స్థానాలపై ఉత్కంఠ నెలకొంది.తెలు గుదేశం,వైసీపీ రెండింటికి ఎంపీ అభ్యర్థులు కొత్త వారే వచ్చే అవకాశం ఉంది.ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యం లో అధిష్ఠానాలు అభ్యర్థులఖరారుపై దృష్టి సారిస్తున్నాయి.

గంజాయి మహమ్మారి..

గంజాయి మహమ్మారి యువత జీవితాలను నిర్వీర్యం చేస్తోంది.ఆంధ్ర ఒడిశా(ఏఓబీ)లో సాగవుతున్న గంజాయి జిల్లాకు కూడా సరఫరా అవుతోంది. పట్టణాలకే పరిమితమైన గంజాయి పొగ ఇప్పుడు పల్లెల్లో గుప్పుమంటోంది. ఈ ఏడాది రూ.2.63 కోట్ల విలువ చేసే 5300 కిలోల గంజాయి పోలీసులకు పట్టుబడింది. వారికి చిక్కకుండా మరో రెండింతల గంజాయి యువత ఆరోగ్యంలోకి చేరి పోయింది. ఇంత జరుగుతున్నా నిఘా, శాంతి భద్రతలు, నేర, నార్కోటిక్స్ తదితర విభాగాలు పసిగట్టలేకపోవడం విస్తుగొలుపుతోంది.

నాణ్యత లేని మద్యం - ఫుల్‌గా సారా

జిల్లాలో మద్యం అమ్మకాలు రూ.100 కోట్లు దాటేశాయి. నాణ్యతలేని ప్రభుత్వ మద్యానికి సారా జతకలిసి ఆరోగ్యాలను గుల్లచేసి కుటుంబాలను నాశనం చేస్తున్నాయి. మద్యం ధరల పెరుగుదలతో గత ప్రభుత్వంలో అదుపులోకి తెచ్చిన సారా ఈ ప్రభుత్వంలో సవాలు విసిరే స్థాయికి చేరింది. గోదావరి లంకల్లో గుట్టుగా తయారు చేసి ఊళ్లలోకి తరలిస్తున్నారు. ఈ ఏడాదిలో ఏకంగా 13,600 లీటర్ల సారా, 1లక్షా 55వేల లీటర్ల బెల్లపు ఊటను సెబ్ సిబ్బంది, పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులకు చిక్కిందే ఇంత పెద్ద ఎత్తున ఉంటే చాటుగా సరఫరా అయిపోయి జనాలను ముంచేస్తున్న సారా ఇంకా ఎంత భారీగా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. దీంతో ఈ నాలుగేళ్లలో కాలేయం, గుండె, ఉదర సంబంధిత వ్యాధులతో బాధపడే మందుబాబుల సంఖ్య గణనీయంగా పెరిగింది. అందుకే ఈ ఏడాది మందు,సారా రెండింటినీ వదిలేసి ఆరోగ్యంగా ఉండాలి.

ప్రాణాలను మింగేస్తున్న రోడ్లు

బయటకు వెళితే ఇంటికి క్షేమంగా చేరుకుంటామన్న నమ్మకం లేదు. ఎందుకంటే రోడ్లు అంత అధ్వానంగా ఉన్నాయి. ఈ ఏడాది 926 రోడ్డు ప్రమాదాలు జరిగాయి. 336 మంది బలైపోయారు. బ్లాక్‌స్పాట్లు గుర్తిస్తున్నా ఒకటి కంటే ఎక్కువ ప్రభుత్వ శాఖలు కలిపి చర్యలు తీసుకోవాల్సి ఉండడం విపరీత కాలయాపనకు దారితీసి భద్రతను ప్రాణాపాయం అధిగమిస్తోంది.

కానరాని పౌరస్పృహ?

రానురాను పౌరస్పృహ నీరసిస్తోంది.నాకెందుకులే అనే ధోరణి మితిమీరుతోంది. కళ్లెదుట దుర్ఘటనలు జరిగినా కనీసం స్పందించకపోగా బాధితులు నెత్తురోడుతున్నా ఫొటోలు, వీడియోలు తీసుకోవడంతో కాలయాపన చేయడం ఆవేదన మిగులుస్తోంది.గతంలో పాఠశాలల్లో ఉండే మోరల్ క్లాసులు మళ్లీ మొదలుపెట్టాలనే వాదన వినిపిస్తోంది.ఈ ఏడాది మహిళల, పిల్లలపై జరిగిన నేరాలకు సంబంధించి 890 కేసులు నమోదయ్యాయి. పౌరస్పృహ ఉంటే వాటి సంఖ్య చాలా వరకూ తగ్గుతుంది కదా!. ప్రశ్నించే తత్వం తగ్గిపోయింది.ధరలు పెరిగినా ధర్నాలు లేవు.. సమస్యలపై నిలదీసేవారు లేరు.. దీంతో ప్రభుత్వ పాలన తీరు మారింది.

మితిమీరిన యువతరం

ఇటీవల కాలంలో యువత మితిమీరి ప్రవర్తించడం, లెక్కలేనితనం ఎక్కువైనట్టు కనిపిస్తోంది. ఒకప్పుడు పెద్దలను చూస్తే నమస్కరించే సంస్కారం అంతరించే దశకు చేరుకొని బీర్ బాటిళ్లతో ఎదురెళ్లి మంచిచెప్పిన వారిపై తిరగబడుతుండడం చూస్తున్నాం. తల్లిదండ్రుల మాట వినకుండా పెడదారులు పట్టడం ఎక్కువకావడం ఎవరూ కాదనలేని వాస్తవం. మరొకరి స్వార్థ అవసరాలకు యువతను నిర్వీర్యం చేస్తున్న ఘనులూ ఉన్నారు. అందువల్ల రేపటి దేశ భవిష్యత్తుకు పునాదులైన యువత ఇప్పటికైనా మేలుకోవాలి. మంచి లక్ష్యంతో ఈ రోజే తొలి అడుగు వేయాలి. ఈ ఏడాది జిల్లాలో 62 అత్యాచారాలు, 24 హత్యలు జరిగాయని పోలీసులు చెబుతున్నారు. తెరమాటున ఉన్నవాటి లెక్క దేవుడికే తెలియాలి. ఈ అఘాయిత్యాల్లో ఎక్కువగా యువతే ఉంటున్నారనేది గణాంకాలు చెబుతున్న వాస్తవం.

నిఘా మెలకువగానే ఉందా?

ఈ ప్రశ్నకు సమాధానం చెప్పడం కాస్త కష్టమే. ప్రజల భద్రత,రక్షణలో నిఘా వ్యవస్థకు అత్యంత ప్రాధాన్యం ఉంది. నేరస్తుల అనుపానులు గమనిస్తూ, నేరాలు జరిగే ఆస్కారంపై అప్రమత్తంగా ఉంటూ ఆయా శాఖలను.. ముఖ్యంగా పోలీసులను అప్రమత్తం చేయడం నిఘా విభాగ ప్రధాన విధి. కానీ గంజాయి, నాటుసారా, గేమింగ్, దొంగతనాలు, హత్యలు, అత్యాచారాలు తదితర నేరాల సంఖ్యను పరిశీలిస్తే నిఘా విభాగం పనితనం డొల్లగా మారినట్టు కనిపిస్తోంది. రాజమహేంద్రవరానికి ఎక్కడెక్కడి నుంచో ఎవరెవరో వస్తుంటారు.నిఘా పనితీరు నీరసంగా ఉండడం ఆందోళన కలిగిస్తోంది.

కలిసి ఉంటే కలదు సుఖం..

అందరం కలిసి ఉంటేనే అది సమాజం. ప్రస్తుత సమా జంలో ఎవరికివారే యమునా తీరే. జిల్లాలో ఈ ఏడాది 700 కొట్లాట/గలాటా/దాడి/గొడవ వంటివి పోలీసుల వద్ద నమోదయ్యాయి. పోలీసుల కంట పడనివి పది రెట్లు ఉంటాయి. రాజీమార్గం రాజమార్గమని అంటారు. 'సారీ' అంటే జారిపోయేదేమీ లేదు. కానీ ఈగో అడ్డొచ్చి సమస్యలను కొనితెస్తోంది. సెల్‌ఫోన్లతో పరిచయం ఎక్కువై కుటుంబీకులు కూడా దూరపు బంధువుల్లా కనిపిస్తున్నారు.ఇలాగే కొనసాగితే మనిషి సంఘజీవి నుంచి ఏకజీవిగా మారే ప్రమాదం లేకపోలేదు.



నూతన వత్సర వేడుకల్లో భాగంగా రాజమండ్రిలో జరిగిన ఒక వేడుకలో ఆడి పాడుతున్న మంగ్లీ

ఎస్ఐ నాగరాజుకు ఉత్తమ ప్రతిభా అవార్డు

నిడదవోలు, డిసెంబరు 31: నిడదవోలు పట్టణ ఎస్ఐ పి.నాగరాజుకు రాజమహేంద్రవరంలో జిల్లా ఎస్పీ జగదీష్ ఉత్తమ ప్రతిభా అవార్డు అందజేశారు. 2023లో మిస్సింగ్ కేసులను త్వరగా పరిష్కరించి శాంతి భద్రతల పరిరక్షణకు ముం దస్తు చర్యల్లో భాగంగా బైండోవర్ కేసులు నమోదు చేసినందుకు నాగరాజుకు ఉత్తమ ప్రతిభా అవార్డు అందజేశారు. ఆయనతో పాటు సీఐ కె.వెంకటేశ్వరరావు, ఏఎస్ఐ కోటేశ్వరరావు, కానిస్టేబుల్ పి.శ్రీనివాస్‌లకు అవార్డులు అందించారు.

ఆనందం వెల్లివిరియాలి: హోం మంత్రి

కొవ్వూరు, డిసెంబరు 31: 2024 సంవత్సరం రాష్ట్రంలోని ప్రతి ఒక్కరికి శుభాలను చేకూర్చాలని, ప్రతి కుటుంబంలో ఆనందం వెల్లివిరియాలని హోంమంత్రి తానేటి వనిత అన్నారు. ఆదివారం మంత్రి వనిత మాట్లాడుతూ ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కొత్త సంవత్సరంలో సరికొత్త ఆలోచనలు, ఆశయాలు, ఆకాంక్షలతో ముందుకు సాగాలని, అందరికి మంచి జరగాలన్నారు. రాష్ట్రంలో అమలవుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలు దిగ్విజయంగా కొనసాగాలన్నారు.



మున్సిపల్ కార్మికుల అర్ధనగ్న ప్రదర్శన

కొవ్వూరు, డిసెంబరు 31: మున్సిపల్ కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికుల పట్ల రాష్ట్ర ప్రభుత్వ మొండి వైఖరిని నిరసిస్తూ అర్ధనగ్న ప్రదర్శన చేపట్టారు. ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ పిలుపుమేరకు కొవ్వూరు మున్సిపల్ కార్యాలయం ఎదుట కార్మికులు చేపట్టిన సమ్మె ఆదివారం ఆరో రోజుకు చేరుకుంది. కార్మికులంతా విధులు బహిష్కరించి, అర్ధనగ్న ప్రదర్శన చేపట్టి నిరసన తెలిపారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎం.సుందరబాబు మాట్లాడుతూ సమ్మె చేస్తున్న మున్సిపల్ కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించకుండా పోటీగా కార్మికులతో పనులు చేయించాలని ఆదేశాలు జారీ చేయడంపై ఆగ్రహం వ్యక్తంచేశారు. చిత్తశుద్ధి ఉంటే పాదయాత్రలో ఇచ్చిన హామీలు అమలు పర్చాలన్నారు. కొవ్వూరు కమిటీ అధ్యక్షుడు భూపతి రవీంద్ర మాట్లాడుతూ ఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా కనీస వేతనం, ఉద్యోగ భద్రతపై సమ్మెలు, పోరాటాలు చేయడం తప్పడం లేదన్నారు. కార్యక్రమంలో కె.రాజేష్, కె.ప్రసాద్, ఎం.జ్యోతి, ఎం.శకుంతల, రాజాన అప్పారావు, మాండ్రు సుధీర్, మీసాల కిషోర్, ఎం.ప్రేమ్, వడ్డాది శ్యాం పాల్గొన్నారు.

కలవచర్లలో టీడీపీ ప్రజా వేదిక


మాట్లాడుతున్న బూరుగుపల్లి శేషారావు

నిడదవోలు, డిసెంబరు 31: వైసీపీ పాలనలో రాష్ట్రాభివృద్ధి కుంటుపడిందని, ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు ప్రజలంతా ఏకం కావాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బూరుగుపల్లి శేషారావు అన్నారు. టీడీపీ జనసేన ఉమ్మడి కార్యాచరణలో భాగంగా ఆదివారం మండలంలోని కలవచర్లలో ప్రజావేదిక నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ, జనసేన పార్టీలు ప్రజల భవిష్యత్తుకు భద్రతకు గ్యారెంటీ ఇస్తూ మినీ మేనిఫెస్టోను విడుదల చేసింద న్నారు. కార్యక్రమంలో వెలగన సూర్యారావు, పోలిరెడ్డి వెంకటరత్నం, మిద్దే మీ నాక్షి, కొండేటి వెంకటేశ్వరరావు, వీరమనేని రామకృష్ణ, శ్రీరాములు పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్‌లో ఫీడింగ్ రూమ్ ప్రారంభం

నిడదవోలు, డిసెంబరు 31: నిడదవోలులోని రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫామ్‌పై వనితా వాసవిక్లబ్ ఆధ్వర్యంలో అమ్మకు వందనం పేరుతో చంటి బిడ్డలకు తల్లి పాలు ఇచ్చేందుకు మదర్ ఫీడింగ్ రూమ్‌ను ఏర్పాటు చేశారు. దీనిని ఆదివారం వాసవి గవర్నర్ కృష్ణాజీ ప్రారంభించారు. ఈ సందర్భంగా వనితా వాసవి క్లబ్ సేవా కార్యక్రమాలను కొనియాడారు. అనంతరం పేద మహిళలకు కుట్టు మిషన్లు, విద్యార్థులకు పుస్తకాలు, కుర్చీలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షురాలు దివ్వెల ఫణిమాధురి, గొల్లపూడి గాయత్రి, జవ్వాది శిరీష, సింహాద్రి శిరీష, జయవరపు లక్ష్మీ, వెంకటరమణ పాల్గొన్నారు.









నూతన సంవత్సర వేడుకల్లో నిబంధనలు పాటించాలి


సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ వర్మ

- బాణసంచా కాల్చొద్దు, లౌడ్‌స్పీకర్లు వినియోగించొద్దు
- అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తే చర్యలు
- కొవ్వూరు డీఎస్పీ వీఎస్ఎన్ వర్మ

కొవ్వూరు, డిసెంబరు 31: నూతన సంవత్సర వేడుకలను నిబంధనలు పాటిస్తూ జరుపుకోవాలని డీఎస్పీ వీఎస్ఎన్ వర్మ అన్నారు. ఆదివారం కొవ్వూరులోని డీఎస్పీ కార్యాలయంలో జరిగిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ డిసెంబరు 31వ తేదీ రాత్రి 1గంట తర్వాత గుంపులుగా తిరగరాదని, బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగడం, రహదారులపై కేకులు కట్ చేయడం, ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించడం చేయరాదన్నారు. నేషనల్ హైవే రోడ్లపై బైక్ రేసులు నిర్వహిస్తే కేసులు తప్పవన్నారు. నూతన సంవత్సరం సందర్భంగా వేడుకలు జరుపుకునే వారు ముందుగా చట్ట పరమైన అనుమతి పొందాలన్నారు. ప్రతి వేడుక వద్ద సీసీ కెమెరాల పర్యవేక్షణ తప్పనిసరి అన్నారు. బాలబాలికలకు వాహనాలు ఇవ్వరాదన్నారు. బాణసంచా కాల్చడం, లౌడ్‌స్పీకర్లు వినియోగించరాదన్నారు. కోడి పందేలు, పేకాట, రికార్డింగ్ డ్యాన్స్, అసాంఘిక కార్యకలాపాలపై చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. కరోనా వ్యాప్తిని నేపథ్యంలో ప్రతిఒక్కరూ సామాజిక దూరాన్ని పాటించాలన్నారు. మద్యం షాపులు రాత్రి 12 గంటలకు, బార్లు రాత్రి 1 గంటకు మూసివేయాలన్నారు. ఆరుబయట ముగ్గులు వేసే సమయంలో గొలుసు దొంగతనాలు జరిగే అవకాశం ఉందని, మహిళలు విలువైన ఆభరణాలు ధరించొద్దన్నారు. విధి నిర్వహణలో ప్రతిభ కనబరచడంలోతో కొవ్వూరు సబ్ డివిజన్‌కు 9 అవార్డులు వచ్చాయన్నారు. సమావేశంలో సీఐలు వి.జగదీశ్వరరావు, వైపీ రమణ, కె.వెంకటేశ్వరరావు, నున్న రాజు, ఆనసూరి శ్రీనివాసరావు, పలువురు ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.



అంగన్వాడీలపై ప్రభుత్వం నిరంకుశ వైఖరి

ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు మాణిక్యాంబ



కొవ్వూరు, డిసెంబరు 31: అంగన్వాడీలు 20 రోజులుగా సమ్మె చేస్తున్నా ప్ర భుత్వం పట్టించుకోకుండా నిరంకుశ వైఖరిని ప్రదర్శిస్తోందని ఏపీ అంగన్వాడీ వర్క ర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు సీహెచ్ మాణిక్యాంబ అన్నారు. అంగన్వాడీ కార్యకర్తలు కొవ్వూరు ఆర్డీవో కార్యాలయం వద్ద చేపట్టిన నిరసన దీక్ష ఆదివారం 20వ రోజుకు చేరింది. హోంమంత్రి ఇంటిని ముట్టడిస్తామని తెలి సి శిబిరానికి వచ్చారని, అయితే మంత్రి వనిత మాటలు భరోసా కల్పించలేదని, నిర్దిష్టమైన హామీ ఇవ్వలేదన్నారు. ఈ నెల 3న జరిగే జిల్లా కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా అధ్యక్షురాలు మాణిక్యాంబ కోరారు. కార్యక్రమంలో అంగన్వాడీలు సీహెచ్ పుష్పావతి, బి.పద్మజ, ఎ.నరసమాంబ, వి.శ్రీదేవి, ఎన్.శాంతకుమారి, బి.వసంత, బి.మణిముత్యం, చిన్నలక్ష్మి, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎం.సుందరబాబు పాల్గొన్నారు.

దేవరపల్లి: దేవరపల్లిలో అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నియోజకవర్గ అధ్యక్షురాలు లక్ష్మి ఆధ్వర్యంలో సమ్మె జరిగింది. ఆమె మాట్లాడుతూ 20రోజులుగా తమ న్యాయమైన డిమాండ్ల కోసం నిరవధిక సమ్మె చేస్తున్నప్పటికీ ప్రభుత్వంలో చలనం లేదన్నారు. అంగన్వాడీ సమ్మెలు పరిష్కరించకపోతే వచ్చే ఎన్నికల్లో వైసీపీకి గుణపాఠం చెబుతామన్నారు. కార్యక్రమంలో పద్మ కామేశ్వరి, గంగాభవాని, సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

గోపాలపురం: స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్వాడీలు కోలాటం చేస్తూ నిరసన వ్యక్తంచేశారు. మండలాధ్యక్షురాలు ఎం.రామలక్ష్మి మాట్లాడుతూ తమ సమస్యలు పరిష్కరించే వరకు ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు. పలువురు కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు



వాహనం ఢీకొని ఆంధ్రా షుగర్స్ ఉద్యోగి మృతి

కొవ్వూరు, డిసెంబరు 31: గుర్తుతెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందినట్టు సీఐ వి.జగదీశ్వరరావు తెలిపారు. కొవ్వూరులోని 16వ వార్డు ఔరంగాబాద్‌కు చెందిన మట్టా దేవుడు(56) సగ్గొండ ఆంధ్రా షుగర్స్‌లో పనిచేస్తున్నాడు. ఈ నెల 30న ఇంటి నుంచి టీవీఎస్ మోపెడ్‌పై డ్యూటీకి వెళ్లాడు. కొవ్వూరు ఆంధ్రా షుగర్స్‌లో మోపెడ్‌ను ఉంచి కంపెనీ బస్సులో సగ్గొండ వెళ్లి తెల్లవారుజామున తిరిగి వచ్చాడు. ఫ్యాక్టరీలో మోపెడ్ తీసుకుని ఇంటికి వస్తుండగా ఔరంగాబాద్ సమాధుల వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. దేవుడు ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు వెతికారు. ఆదివారం మధ్యాహ్నం సమాధుల వద్ద దేవుడు మృతదేహాన్ని గుర్తించారు. డీఎస్పీ వీఎస్ఎన్ వర్మ, సీఐ వి.జగదీశ్వరరావు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కొవ్వూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఎస్ఐ జీవీవీ సత్యనారాయణ కేసునమోదు చేసినట్టు సీఐ తెలిపారు.

రెండు వర్గాల ఘర్షణ.. ఒకరి మృతి

తాళ్లపూడి, డిసెంబరు 31: మండలంలోని మలకపల్లిలో ఆంధ్ర ఎవాంజలికల్ చర్చిలో రెండు వర్గాల మధ్య జరిగిన ఘటనలో ఒక వ్యక్తి మృతి చెందా డు. పోలీసుల వివరాల ప్రకారం.. దేశాబత్తుల రమణ(50) ఆదివారం చర్చికి వెళ్లారు. చర్చిలో రెండు వర్గాలు ఘర్షణ పడ్డారు. వారిని విడదీయడానికి కొంతమంది మహిళలతో కలిసివెళ్లి ఇబ్బందులకు గురయ్యారు. ఈ సందర్భంగా జరిగిన తోపులాటలో రమణ ఊపిరాడక అపస్మారకస్థితిలోకి వెళ్లి ప్రాణాలు కోల్పోయాడు. ఎస్ఐ కె.వెంకటరమణ కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

దమ్మెన్నులో ఉచిత గుండె వైద్యశిబిరం

ఉండ్రాజవరం, డిసెంబరు 31: మండలంలోని దమ్మెన్ను గ్రామంలో ఆది వారం విజయవాడకు చెందిన ఉషా కార్డియాక్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత గుండె వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో 60మందికి ఏకో, గుండె స్కానింగ్, ఈసీజీ పరీక్షలు ఉచితంగా చేశారు. ఏడుగురికి వివిధ ఆపరేషన్లు చేయడానికి నిర్ధారించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ జి.సత్యనారాయణ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

దత్తత విద్యార్థికి ఆర్థిక సాయం

రాజమహేంద్రవరం సిటీ, డి సెంబరు 31: పేద విద్యార్థి చదు వు నిమిత్తం టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఆదిరెడ్డి శ్రీనివాస్ ఆర్థిక సాయం చేశారు.

